ప్రజాశక్తి
మంగళవారం 30 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు



క్రికెట్ టోర్నీ విజేత ముంచంగిపుట్టు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలో ఏనుగురాయి పంచాయతీ నిట్టాపుట్టు గ్రామంలో ఇటుకల పండుగ సందర్భంగా కె.ఎన్.పి.ఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ క్రికెట్ టోర్నీలో మొత్తం 20జట్లు పాల్గొన్నాయి. ముంచింగిపుట్టు వర్సెస్ సుజనపేట జట్ల మధ్య హెూరాహెూరీగా సాగిన మ్యాచ్‌లో ముంచింగిపుట్టు జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా సుజనపేట జట్టు, తృతీయ స్థానంలో ఏనుగురాయి, నాలుగో స్థానంలో నడుమూరు జట్లు నిలిచాయి. ప్రథమ విజేత జట్టుకు రూ.14వేలు, ద్వితీయ రూ.7వేలు, తృతీయ స్థానంకు రూ.1500 చొప్పున నగదు బహుతులతో పాటు ట్రోఫీలను మాజీ సర్పంచ్ మఠం ముకుందు పడాల్, కె.ఎన్.పి.ఆర్ యూత్ సభ్యులు ప్రధానం చేశారు.


ట్రోఫీని అందుకుంటున్న విజేతలు

ఇక సమరమే..!

-ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
-రంపచోడవరం నుంచి బరిలో 12 మంది
-పాడేరు నుంచి 16 మంది, అరకు నుంచి 17 మంది ?

ప్రజాశక్తి-పాడేరు, రంపచోడవరం విలేకరులు : సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. బతిమలాట, బుజ్జగింపుల ప్రక్రియ పూర్తవడంతో బరిలో వున్న అభ్యర్థులు మంగళవారం నుంచి పూర్తిగా ప్రచారంపై దృష్టి కేంద్రీకరించనున్నారు. అల్లూరి జిల్లాలోని రంపచోడవరం నియోజకవర్గం బరిలో 12 మంది అభ్యర్థులు ఉన్నారు. సిపిఎం అభ్యర్థి లోతా రామారావు (సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు) వైసిపి అభ్యర్థి (నాగులపల్లి ధనలక్ష్మి (ఫ్యాన్), టిడిపి అభ్యర్థి మిరియాల శిరీష దేవి (సైకిల్), బిఎస్‌పి అభ్యర్థి కాకూరు కన్నంరెడ్డి (ఏనుగు) అండ్ పార్టీ అభ్యర్థి దుమంత్ విశ్వనాథం (మంచం) భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థి అంజిరెడ్డి (హాకీ బ్యాట్ బాల్), పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి మనపూడి సుబ్బారావు (టెలివిజన్)తో పాటు ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు కుంజా శ్రీను (గ్యాస్ సిలిండర్), పట్టాల అచ్చిరెడ్డి (పనసకాయ), పాలడుగు లక్ష్మీ ప్రసన్న (పుచ్చకాయ), పాలడుగు శ్రీ వెంకటేశ్వరరావు (ఇటుకలు), బంగారు వెంకటేష్ (బెలూన్ గుర్తు) బరిలో ఉన్నారు. అయితే జిల్లాలోని పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల జాబితాను అధికారులు సోమవారం రాత్రి 10 గంటల సమయానికి కూడా అధికారికంగా వెల్లడించలేదు. పాడేరు అసెంబ్లీ స్థానానికి 16 మంది, అరకు అసెంబ్లీ స్థానానికి 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు సమాచారం. పాడేరు అసెంబ్లీ స్థానం నుంచి టిడిపి అభ్యర్థిగా ముందు ప్రకటించబడిన కె.రమేష్ నాయుడు తన నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. అరకులో టిడిపి రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహం బరిలో ఉన్నారు. ఇక అరకులో మత్స్యలింగం (వైసిపి), పాంగి రాజారావు (బిజెపి), శెట్టి గంగాధరస్వామి (కాంగ్రెస్) మధ్య పోటీ నెలకొంది. పాడేరులో గిడ్డి ఈశ్వరి (టిడిపి), విశ్వేశ్వరరాజు (వైసిపి), శతక బుల్లిబాబు (కాంగ్రెస్) మధ్య ముక్కోణ పోటీ జరగనుంది.

పాడేరు


విశ్వేశ్వరరాజు , వైసిపి


గిడ్డి ఈశ్వరి, టిడిపి


బుల్లిబాబు, కాంగ్రెస్

అరకులోయ


మత్స్యలింగం, వైసిపి


పాంగి రాజారావు , బిజెపి


గంగాధరస్వామి, కాంగ్రెస్

రంప చోడవరం


ధనలక్ష్మి, వైసిపి



శిరీషా రాణి, టిడిపి


లోతా రామరావు, సిపిఎం


గొల్లగూడెం ప్రాంతంలో ఉన్న వీర్రాజు మృతదేహం
ఇన్‌సెట్‌లో వీర్రాజు (ఫైల్‌ఫొటో)

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి ఎటపాక
మండలంలోని గొల్లగూడెం గ్రామంలో వడదెబ్బ తగిలి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఎటపాక గ్రామానికి చెందిన సిర్రా వీర్రాజు (38) తన గొర్రెలు, మేకలను ఆదివారం మేతకు తోలుకొని వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల తిరిగి వెతికినా ఎక్కడ అతని ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం మళ్ళీ కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి అతని ఆచూకి కోసం గాలించగా గొల్లగూడెం పరిసర ప్రాంతంలో మృతి చెంది ఉన్నాడు. ఎండ తీవ్రతో వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు స్థానికులు చెప్పారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్రామాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు
జీకే వీధి మండలం, గాలికొండ పంచాయితీలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన కొండజర్త, మైనకోట, గొడుగు రాయి, ముగ్గురేవుల, సప్తగూడ, పెద్దలంక, పాత్రనుగుంట ప్రాంతాల్లో పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా పోలీసులు ముందే చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాలపై మావోయిస్టులు కదిలికులపై స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆరా తీశారు. అనంతరం గిరిజనులతో సమావేశమై గ్రామాలకు రహదారులు, సెల్ టవర్లు, ఉపాధి కల్పనకు పోలీసు శాఖ కృషి చేస్తుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. యువత ఉద్యోగ ఉపాధి కల్పన క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయా గ్రామ గిరిజనులకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. యువ క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు ఎస్ఐ పంపిణీ చేశారు.


గిరిజనులకు మందులు అందిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

సిహెచ్‌సిలో సకాలంలో అందని డైట్

-ఆకలితో అలమటించిన రోగులు -అధికారులకు ఫిర్యాదు చేసిన ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాలల్లో మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రకటనలు ఇస్తూ ప్రచారం చేస్తున్నా... క్షేత్రస్థాయిలో మాత్రం కానరాలేదు. మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో వార్డులలో ఉన్న రోగులు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందక అవస్థలు పడ్డారు. ఆదివారం ఉదయం 10 గంటలైనప్పటికీ అల్పాహారం అందలేదు. దీంతో, రోగులు అర్థాకలితో అల మటించారు. వార్డుల్లో ఉన్న రోగులు కాలకృత్యాలు చేసుకొని అల్పాహారం కోసం ఉదయం 10 గంటల వరకు చూశారు. కానీ, అప్పటివరకు కూడా అల్పాహారం సదరు గుత్తేదారు అందించక పోవడంతో చేసేది లేక ఆకలితో రోగులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది రోగుల బంధువులు బయట హెూటల్స్ లో అల్పాహారం కొనుగోలు చేసి ఆకలి తీర్చుకున్నారు. ఇదే కాకుండా మధ్యాహ్నం ఒంటిగంటకు అందించవలసిన భోజనం సాయంత్రం నాలుగు గంటలకు అందించారు. దీంతో, మధ్యాహ్నం బాలింతలు, రోగులు ఆకలితో సతమత మయ్యారు. రాత్రి 7 గంటలకు అందించ వలసిన భోజనం అర్ధరాత్రి 11 గంటలకు వివాహ వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని ఆసుపత్రి వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు పంపిణీ చేశారని రోగుల బంధువులు గొల్లూరి సత్యవతి, బాలింతలు బరడ, వి.దసుధ బాలింతరాలు గాదెల బురుగు, ఏ.రాజమ్మ, కిల్లో తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదే తరహాలో సోమవారం ఉదయం అందించాల్సిన అల్పాహారం పూర్తిగా అందించక పోవడంతో ఆకలితో అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై వార్డులో చేరిన రోగులు, వారి బంధువులు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్ , సొలగం గాసిరం దొరలకు తెలిపారు. దీంతో, సిహెచ్‌సికి చేరుకొని రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం నేతలు ఐటీడీఏ పీవో అభిషేక్, డిసిహెచ్ ఎస్ అధికారికి ఫోను ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై డిసిహెచ్ ఎస్ అధికారి స్పందించి ప్రస్తుత టెండర్ గుత్తేదారుడిని తొలగించి నూతన గుత్తేదారులను ఏర్పాటు చేయాలని వైద్యాధికారిని ఆదేశించినట్లు గిరిజన సంఘం నేతలు స్థానిక విలేకరులకు తెలిపారు.

ఈ విషయంపై గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, రెండు వార్డులకు కలిపి ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉండటం, రన్నింగ్ వాటర్ సక్రమంగా అందక పోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోన్నే సదరు గుత్తేదారుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సమయపాలన లేకుండా, నాణ్యత లేని ఆహారాలను రోగులకు అందజేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి సిహెచ్‌లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో సిహెచ్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


ఆసుపత్రిలో ఆదివాసీ గిరిజన సంఘం నేతలు


వార్డులోని బాలింతలు


మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

-రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని అరుకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి .అభిషేక్ స్పష్టం చేశారు. ఐటిడిఏ కార్యాలయం సమావేశ మందిరంలో, పాడేరు, అసెంబ్లీ నియోజకవర్గం సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈవీఎంలు సక్రమంగా పని చేయకుంటే వెంటనే స్పందించి సంబంధిత పరికరాన్ని మార్చాలని సూచించారు. ఫోల్ పర్సంటేజ్‌పై ఎప్పటికప్పుడు సమాచారం అందిం చాలన్నారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించి సాయంత్రం నాలుగు గంటలకు ముగించాలని చెప్పారు. ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమా వేశంలో ఎస్‌డిసి వి.వి.ఎస్ శర్మ, తహసిల్దారులు బి. రవికుమార్, రాజా రామ్మోహన్‌రావు, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


బావిని పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి, సిపిఎం నేతలు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని రంగశీల పంచాయితీ ఒంటిపాక గ్రామాన్ని సోమవారం హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపిపీ సూడిపల్లి కొండలరావు బృందం సందర్శించారు. గ్రామంలో తాగునీటి సమస్యపై మహిళలు ప్రస్తావించారు. విద్యుత్ మోటార్ పాడవడంతో ఊరికి దూరంలో పొలాల వద్ద ఉన్న నుయ్యి వద్ద నుండి నీటిని సేకరిస్తున్నామ్మని మహిళలు పేర్కొన్నారు. నీటి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. అనంతరం వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఐదేళ్ల కాలంలో గిరిజనులకు చేసింది ఏమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు దేముడు నాయుడు, మండల నాయకులు మర్రి చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ క్రాంతి రాజు, కాంగ్రెస్ నాయకులు జానకి రామ్, సాదు, వంతల రామకృష్ణ ,బీబీ రవికుమార్, మంగరాజు, రాధ లక్ష్మి పాల్గొన్నారు.

సిపిఎం గెలుపుతోనే ఏజెన్సీ అభివృద్ధి

ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అప్పలనర్స, రామారావు
- గ్రామాల్లో విస్తృతంగా ప్రచారాలు


ఓటరుకు కరపత్రం ఇచ్చి ఓటు అభ్యర్థిస్తున్న లోతా రామారావు

ప్రజాశక్తి- వై.రామవరం
రానున్న ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్ట సభలకు పంపిస్తేనే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు అన్నారు. వై.రామవరం మండలం ఎర్రం రెడ్డిపాలెం, బులోజిపాలెం, కోట, రేగడి పాలెం, పెద్ద ఊళ్లంపాడు, దాలిపాడు, చవిటి దిబ్బలు, చింతకరపాలెం, వై.రామవరం మెయిన్ రోడ్డు తదితర గ్రామాల్లోనూ, వై.రామవరం సంత మార్కెట్‌లోనూ సోమవారం రామారావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటికీ వై.రామవరం మండలంలో 24 గ్రామాలకు రోడ్డు మార్గం లేదని, గుత్తేడుకు రోడ్డు లేక చుట్టూ. 250 కిలోమీటర్లు తిరిగి మండల కేంద్రానికి రావాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఈ రోడ్లకు మోక్షం కలగలేదన్నారు. తనను గెలిపిస్తే ఏజెన్సీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు ఈ కార్యక్రమంలోచ సిపిఎం మండల కార్యదర్శి శాంతిరాజు, జిల్లా నాయకులు జి.రామకృష్ణ, ఆంజనేయులు, మల్లికార్జున, దుర్గ, ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ఒడ్డుగూడెం పంచాయతీ పరిధిలో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్సకు గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ పూనం సరోజిని, నాయకులు కారం సుందరయ్య, వడ్లది రమేష్, జి.లక్ష్మణరావు, ఉప సర్పంచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మండలంలోని రామవరం గ్రామపంచాయతీ పరిధి పులి కారం గుంపు, రామవరం, సోములగూడెం, లక్ష్మీ నగర్, కొప్పపల్లి గ్రామాలలో సిపిఎం శాఖ కార్యదర్శుల ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఎం నాయకులు రమేష్, ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో కారం సుందరయ్య, పులి బుజ్జి పాల్గొన్నారు.

మండలంలోని ములకలపల్లి, కుంద్దులూరు పంచాయతీలో సిపిఎం ముఖ్య కార్యాకర్తల సమావేశం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, సర్పంచ్ సవలం మారయ్య, పండ వెంకటేష్, మురళి పాల్గొన్నారు

ఎటపాక : సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆదివారం రాత్రి మండలంలోని గొళ్లగట్ట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమవారం ఉదయం వీరయిగూడెంలో ఉపాధి హామీ పని ప్రదేశవలో కూలీతో మాట్లాడారు. ఎర్రగట్టు, రాఘవ పురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, ఆకిశెట్టి రాము, ప్రసన్న, ఇరపా సత్యం, సోందే రామారావు, ఇరప అజయ్, పర్సిక ధర్మరాజు, ఊకె బాబు పాల్గొన్నారు.

కూనవరం : ముంపు మండలాల ప్రజలకు న్యాయం జరగాలంటే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. మండలంలోని పోచవరం గ్రామంలో సోమవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఐ.వెంకటేశ్వరావు, సర్పంచ్ వెంకమ్మ, కార్యకర్తలు శ్రీరాములు, రాజు, కారం కన్నారావు, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

దేవీపట్నం : పోలవరం నిర్వాసితుల సమస్యలపై చట్టసభల్లో మాట్లాడే వారికే ఓట్లు వేయాలని సిపిఎం జిల్లా నాయకులు పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు సోమవారం పెద్ద భీంపల్లి, ఇందుకూరు, ఇందుకూరుపేట, పోతవరం, కచ్చులూరు, దండంగి తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. పిఎన్‌ఎం కళాకారుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రంపచోడవరం : గిరిజన హక్కులు రక్షించబడాలంటే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని రంప, కొత్తపాకలు, బందపల్లి గ్రామాల్లో సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పది సంవత్సరాలలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు గిరిజనులకు చేసిన ద్రోహాన్ని వివరించారు.

సీలేరు : జీకే వీధి మండలం జెర్రిల పంచాయతీలో సిపిఎం నాయకులు కె.బోడయ్య పడాల్ ఆధ్వర్యాన విస్తృతంగా ప్రచారం చేశారు. అరకు పార్లమెంటు అభ్యర్థి పాసిపెంట అప్పలనర్సను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

పెదబయలు : మండల కేంద్రంలోని వారపు సంతలో అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధరస్వామి సోమవారం వారపు సంతలో ప్రచారం నిర్వహించారు, ముందుగా పార్టీ కార్యాలయం నుండి మోదకొండమ్మ గుడి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారపు సంతలో వ్యాపారుల వద్దకు వెళ్లి కరపత్రాలు అందించారు. అనంతరం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స మాట్లాడుతూ, బిజెపి, వైసిపి పాలనలో ఆదివాసీ గిరిజనులు విసిగి పోయారన్నారు. 400 ఎంపీ సీట్లు వస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తామని నరేంద్ర మోడీ, అమిత్ షా చెపుతున్నారని విమర్శించారు. జిఒ 3పై వైసిపి ప్రభుత్వం కనీసం రివ్యూ పిటిషన్ వేసిన దాఖలాలు లేవన్నారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ఇండియా ఫోరం పని చేస్తుందని తెలిపారు. గంపరాయి, గలగండ, ఈదులపుట్టు, మంగబంద, అరడకోట గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర స్వామి, మండల సిపిఎం కార్యదర్శి బోండా సన్నిబాబు, నాయకులు బోండా గంగాధరం, శరబన్న, జంపరంగి సునీల్ కుమార్, చెండా సన్యాసి పాల్గొన్నారు

అరకులోయ : మండలంలోని చినలబుడు పంచాయతీ కారాయిగూడ, హట్టగూడ, దొరవలస, తురయిగూడ గ్రామాల్లో సిపిఎం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. సిపిఎం జిల్లా నాయకులు పి.బాలదేవ్, మొద్దు, గాశి, ముకుంద, సోమన్న, బుజ్జిబాబు, కాంగ్రెస్ మహిళా మండల నాయకురాలు గొల్లోరి పద్మ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని, 11 చెక్ డ్యామ్‌ల పునర్నిర్మాణం చేస్తామన్నారు.



విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి ఆధ్వర్యాన ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

దుంబ్రిగుడ : అరకు పార్లమెంట్ సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు ఓటేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని సాగర పంచాయతీ సిమిలిగూడ, ముగ్రి గయడ, వసబంధ గ్రామంలో ఆ పార్టీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేపట్టారు. అనంతరం గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, సీనియర్ నాయకుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, సిపిఎం పోరాటం ఫలితంగా సిమ్మిగుడ, వసబంధలో రోడ్డు సౌకర్యం వచ్చిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి సత్యనారాయణ, కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

హుకుంపేట : మండలంలోని రంగశీల పంచాయతీ ఒంటిపాక, సిమిలిగూడ, రంగశీల తదితర గ్రామాల్లో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు. అప్పలనర్స, గంగాధర స్వామిలను గెలిపించాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు జి దేముడునాయుడు, వైస్ ఎంపీపీ కొండలరావు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై మాట్లాడేది సిపిఎం అని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యపురం మాజీ ఎంపీటీసీ పెనుమల క్రాంతి రాజు, మర్రి చిట్టిబాబు, కాంగ్రెస్ నాయకులు జానకి రామ్, సాదు, రాధ లక్ష్మి, వంతల రామకృష్ణ, బీబీ రవికుమార్, మంగరాజు, మహేశ్వరరావు పాల్గొన్నారు.

అనంతగిరి : సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో ఓటు వేసి గెలిపించాలని మండల కేంద్రంలోని వారపు సంతలో ప్రచారం చేపట్టారు. మూడు రోడ్ల కూడలి నుండి వారపు సంత మీదుగా బొడ్డచెట్టు కాలనీ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యధర్శి ఎస్.నాగులు, కాంగ్రెస్ మండల నాయకులు ఎం.అప్పాలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు

చింతపల్లి : మండలంలోని అన్నవరం సంతలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసి ప్రజలను ఇబ్బందుల పాలు చేశాయన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, పాంగి జీవన్ కృష్ణ, సీదరి సత్తిబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.


దుంబ్రిగుడ మండలం, సాగర పంచాయతీలో ప్రచారం చేస్తున్న దృశ్యం

ఆదివాసీ గిరిజన సంఘం నేత అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లి జిల్లా చోడవరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాలను జి మాడుగుల మండలం మద్దులబంద గ్రామంలో పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించడం అన్యాయమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ ఖండించారు. సోమవారం అరకులోయలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ ఉద్యమ నాయకులపై నిర్బంధం సరికాదన్నారు. రాష్ట్రంలో వైసీపీకి ఓటమి భయం పట్టిందని, అందుకే ఉద్యమ నాయకులను, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తుందని ధ్వజమెత్తారు.

వైసిపి నేత మృతి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీకి చెందిన పెద్దపేట గ్రామ నివాసి, మండల వైసిపి సీనియర్ నేత కిల్లో జయరాం అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఎంపిటిసి చెట్టి ఫాల్గుణ, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గుమ్మ తనూజరాణి, రేగం మత్స్యలింగంలు మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.

అస్తవ్యస్తంగా జగనన్న ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్.నాగాపురం, పాతకృష్ణదేవిపేట పంచాయతీలకు కేటాయించిన జగనన్న ఇళ్ల స్థలాలు నివాసాలకు అనువుగా లేక పోవడతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ రెండు పంచాయతీల్లో 178 మంది ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి రెండేళ్ల క్రితం సిహెచ్.నాగాపురంలో జగనన్న ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ స్థలాలు అనువుగా లేవు. దీంతో చేసేది లేక 173 మంది లబ్ధిదారుల్లో సుమారు 10 మంది మాత్రమే పునాదులు తీశారు. అవి ప్రస్తుతం నిరుపయోగంగా పడిలేశారు. దీనికి తోడు ఈ స్థలాలకు ఆనుకొని శ్మశానం, మరో వైపు సాగునీటి చెరువు ఉంది. సిహెచ్.నాగాపురం గ్రామంలో 75 మంది లబ్ధిదారులకు, పల్లపురం 25 మందికి, కుమారపురం 11 మందికి, పాతకృష్ణదేవిపేటలో 62 మందికి ఈ లబ్ధిదారులకు ఈ స్థలాల్లో పట్టాలు మంజూరు చేశారు. ఈ లేఅవుట్‌లో రూ.20లక్షలకు పైగా వెచ్చించి విద్యుత్‌శాఖాధికారులు విద్యుత్ స్తంభాలు వేశారు. అయినా స్థలాలు నివాసాలకు అనువుగా లేక చాలా మంది పట్టాలకే పరిమితమయ్యారు. వర్షాకాలంలో జగనన్న ఇళ్ల స్థలాలకు వద్దకు వెళ్లేందుకు సరైన రహదారి లేదు. కానీ చెరువుకు కాలువ ఉంది. దీనికి ప్రభుత్వం కల్వర్టు నిర్మించాల్సి ఉంది. పక్కనున్న చెరువులు నిండితే భారీ కల్వర్టు నిర్మించాల్సి ఉంది. గతంలో పక్కనున్న చెరువులు నిండితే పంట పొలాలు నీట మునిగిన దాఖలాలు ఉన్నాయి. ఇటువంటి చోట సుమారు మూడెకరాలు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. స్థలాలను అనువుగా మార్పు చేయాలని వారు కోరుతున్నారు.

52 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి-కోటవురట్ల: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండల ఎన్నికల జాబితా అధికారులు సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 25 గ్రామాలకు గాను 52 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మండల వ్యాప్తంగా ఓటర్లు స్త్రీలు 22,754, పురుషులు 21,705, ఉండగా, వృద్ధులకు వికలాంగులకు మండల వ్యాప్తంగా 45 మందిని గుర్తించి ఇంటి వద్ద ఓటు వేసే ఏర్పాట్లు చేసామన్నారు. అదేవిధంగా ఉద్యోగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఇంతవరకు 272 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల వారిగా ఓటర్ల వివరాలు..పాములవాకలో 2277, బికెపల్లి 1720, అన్నవరం 1531, ఎండపల్లి 1601, జల్లూరు 1152, రామచంద్రపాలెం 1386, నీలింపుంట 1054, పేట పల్లి 1222, ఎ ఎస్ పేట 908, చిన్న బొడ్డేపల్లి 1059, కొడవటిపూడి 2482, వెంకటాపురం 3614, టి జగ్గంపేట 618, తిమ్మాపురం 623, కైలాసపట్నం 1850, కోటవురట్ల 5804, లింగాపురం 1774, తంగేడు 2068, సుంకపూర్ 1428, రామన్నపాలెం 939, రాజుపేట 1797, చౌడువాడ 1660, గొట్టివాడ 1361, ఆర్ సి పురం1162, పందూరులో 1552 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

మూతబడిన చలివేంద్రం

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం ఏకైక మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రం మూడు రోజుల ముచ్చటగానే మూతబడింది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా కొన్ని రోజుల క్రితం పంచాయతీ అధికారులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. నీరు పోయక కొద్ది రోజులుగా చలివేంద్రంలో ఖాళీ కుండ దర్శనమిచ్చింది.

సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

సాధారణ పరిశీలకులు కె. వివేకానందన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత, పరిశీలకులు వివేకానందన్

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికలు ఎన్నికల సంఘం నిబంధనల మేరకే నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించుటకు సహకరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.వివేకానందన్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పాడేరు లోని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోటీలో ఉన్న 12 మంది అభ్యర్థులు, ప్రతినిధులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 518 ఈవిఎంలు, 518 వివి ప్యాట్లు పంపించడం జరిగిందని, వాటిని రంపచోడవరం గిరిజన ఆశ్రమ పాఠశాల భవనంలో స్ట్రాంగ్ రూములో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో భద్రపరచి సీలు వేయడం జరిగిందని తెలిపారు. మే 1న రాజకీయ పార్టీల సమక్షంలో ర్యాండమైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లకు పాసులు జారీ చేయాలని ఆర్‌ఓలను ఆదేశించారు. స్ట్రాంగ్ రూములో సిసి టీవీలు ఏర్పాటు చేయాలన్నారు. 85 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వచ్చే నెల మూడు, నాలుగు, ఐదు తేదీలలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో కమిషనింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత మాట్లాడుతూ 399 పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల లోపు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారం చేయరాదన్నారు. మే 13న ఉదయం 5.30 గంటలకు రాజకీయ పార్టీలకు సంబంధించిన ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు పేర్లు ఎన్నికల రోజున తప్పనిసరిగా ప్రకటించాలన్నారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రంపచోడవరం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశంలో రంపచోడవరం తహసీల్దార్ ఎ. కృష్ణ జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, శివ, రాజు, విశ్వనాథ్, బాలాజీ, చైతన్య, సరిత, సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులు అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయాలను లెక్కించాలి

- పార్లమెంటరీ వ్యయ పరిశీలకులు గురు కరణ్ సింగ్



పరిశీలిస్తున్న గురు కరణ్‌సింగ్

ప్రజాశక్తి-పాడేరు: ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా విధులు విర్వర్తిం చాలని అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు గురు కరణ్ సింగ్ సూచించారు. సోమవారం జిల్లాకు చేరుకున్న ఆయనను కలక్టర్ ఎం. విజయసునీత, ఎస్.పి. తుహిన్ సిన్హా, డిఆర్ఓ బి. పద్మావతిలతో కలక్టర్ చాంబర్ లో ఎన్నికల నిర్వహణపై చర్చించారు. తదుపరి జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గురు కరణ్ సింగ్ మాట్లాడుతూ, ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల వ్యయాల వివరాలను ఖచ్చితత్వంతో లెక్కించాలన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసా కూడా ఎన్నికల వ్యయంలోకే వస్తుందని, వాటిపై ఏఈఓలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల వ్యయం లెక్కింపులో పని చేసే బృందాల నుంచి ఎప్పటికపుడు వివరాలు సేకరించాలని, వాటిని సంబంధిత పట్టికల ద్వారా ఎన్నికల వ్యయ రిజిష్టరులో నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా పత్రికలు, వివిధ చానళ్లలో ప్రసారమైన ప్రకటనలు, చెల్లింపు వార్తలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు విభాగాలు నిర్వహిస్తున్న రిజిష్టర్లను పరిశీలించారు. అదే విధంగా వివిధ చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల లైవ్‌ను, సివిజిల్ వాహనాల నిఘాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంసిఎంసి సభ్యులు పి.గోవింద రాజులు, నోడల్ అధికారులు ఎం.శివయ్య, సాయి నవీన్, ఎల్‌బి వెంకటరావు, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వేసవి కిట్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు మండుటెండలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు థర్మర్ వాటర్ బాటిళ్లు, నాప్కిన్లు, చలువ కళ్లద్దాలు, తెలుపు టోపీలు, మజ్జిగ ప్యాకెట్లను సిపి ఎ.రవిశంకర్, జాయింట్ సిపి ఫకీరప్ప అందించారు. యంగ్ ఇండియన్స్ ఎన్జీవో సహకారంతో హార్మోనీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగముగా 66 ఎమర్జెన్సీ ట్రామా కిట్లను కూడా ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ, సీపీ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. 2,65,000 వెచ్చించి థర్మల్ వాటర్ బాటిళ్లు, నాప్కిన్లు, చలువ కళ్లద్దాలు, తెలుపు టోపీలు కొనుగోలుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎడిసిపి, ట్రాఫిక్ ఎసిపి-1 విరాట్ మహేశ్వరి, హార్మోనీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాయ్ కొడాలి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పాలకొండ నుండి భార్యాభర్తలు ఈగల గోపి, రేవతిలు పాప హేమవర్షిని తో కలిసి బైక్ పై రాచపల్లి వెళుతున్నారు. నక్కపల్లి జాతీయ రహదారిపై ఉపమాక వెంకన్న ఆర్చి జంక్షన్ వద్ద కు వచ్చే సరికి ఉపమాక నుండి వచ్చే మార్గం గుండా మోటూరు అప్పలరాజు, కిరణ్ కుమార్ (తండ్రి ,కొడుకు) బైక్ పై సడన్‌గా రోడ్డు పైకి రావడంతో రెండు బైకులు బలంగా ఢీకొన్నాయి. దీంతో ఈగల గోపి, పాప హేమవర్షిని, మోటూరు కిరణ్ కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పిహెచ్‌సిలో గాయపడ్డ వారికి ప్రథమ చికిత్సను అందించారు. మెరుగైన వైద్యం కోసం గోపి, కిరణ్‌కుమార్‌లను అనకాపల్లి ఎన్.టి.ఆర్ ఆసుపత్రికి తరలించారు.

పరిపాలనా రాజధానిగా విశాఖ : బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగన్మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని, పరిపాలన రాజధానిగా విశాఖపట్నం రానుందని విశాఖ పార్లమెంట్ వైసిపి అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. జివిఎంసి 36వ వార్డులో సోమవారం దక్షిణ వైసిపి అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్‌తో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరోసారి విజయం సాధించి, విశాఖలో ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. పూర్ణా మార్కెట్ నుంచి ప్రారంభించిన ప్రచార కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, 36వ వార్డు కార్పొరేటర్ మేరీ జోన్స్, పార్టీ సీనియర్ నాయకుడు మాసిపోగు రాజు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఎవిఎన్ కాలేజీ రోడ్డు, చిన్నరెల్లి వీధి,రెల్లి వీధి వరకు ప్రచార ర్యాలీ సాగింది.

'గంగవరం' సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంవత్సర కాలంగా మెరుగైన వేతనం, హక్కుల కోసం పోరాడుతున్న గంగవరం పోర్టు సర్వీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (జిపిఎస్) ఉద్యోగులకు కనీస వేతన చట్టప్రకారం నెలకు రూ.36వేలు ఇవ్వాలని, వారందరినీ అదానీ పోర్టు ఉద్యోగులుగానే పరిగణించి ఉద్యోగ భద్రత కల్పించాలని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు పి.రఘు, ప్రధాన కార్యదర్శి కె.అనురాధ డిమాండ్ చేశారు. గంగవరం, దిబ్బపాలెం నిర్వాసిత ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తమ సంస్థ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు.

19వ వార్డులో వెలగపూడి ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు సోమవరం 19వ వార్డు పరిధి వసువానిపాలెం, జాలారి ఎండాడలో ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, బిజెపి నాయకులు పాల్గొన్నారు

జివిఎంసి 10వ వార్డు పరిధి ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో వెలగపూడి సతీమణి సుజన ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి వెలగపూడిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ సిక్స్ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమా, పీతల అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గొలుగొండ: రాష్ట్రం బాగు కోసం కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాలని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. సోమవారం మండలంలోని కొత్తఎల్లవరం గ్రామంలో ఎన్నికల శంఖారావం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీలు, దౌర్జన్యాలు పెరిగాయి తప్పా అభివృద్ధి జాడ కానరాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమికి పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- నక్కపల్లి: తెలుగుదేశం పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని గొడిచెర్ల, నెల్లిపూడి, ఎన్ నరసాపురం, చినతీనార్ల గ్రామాలకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ మేరకు సోమవారం నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్ నందు ఆమె స్వగృహంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. గొడిచెర్ల నుండి 60 కుటుంబాలు, నెల్లిపూడి, ఎన్.నరసాపురం గ్రామాల నుంచి 20 కుటుంబాలు, చిన తీనార్ల గ్రామం శెట్టిబలిజ పేటకు చెందిన పలువురు వైసీపీని వీడి టిడిపిలో చేరినట్లు తెలిపారు.

చోడవరం సుగర్స్‌ను లూటీ చేసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-చోడవరం

టిడిపి ప్రభుత్వ పాలనలో చోడవరం చక్కెర కర్మగారాన్ని లూటీ చేశారని చోడవరం వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ ఆరోపించారు. సోమవారం స్థానిక కొత్తూరు జంక్షన్లో జరిగిన జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభలో ధర్మశ్రీ మాట్లాడుతూ టిడిపి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు కర్మాగారంలో రూ.150 కోట్లు అవినీతికి పాల్పడ్డారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫ్యాక్టరీకి ఉన్న అప్పును రూ.70 కోట్లుకు తగ్గించమన్నారు. సుమారు రూ.80 కోట్లు ప్రభుత్వం నుండి నిధులను రప్పించి ఫ్యాక్టరీని కాపాడేమన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ నాన్ లోకల్ వ్యక్తి అయిన సీఎం రమేష్ కేవలం ఈ ప్రాంతంలో వనరులను దోచుకోవడానికే ఎంపీగా పోటీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఏడవక సత్య రావు, ఎంపీపీ గాడి కాసు, జడ్పిటిసి మారిశెట్టి విజయ శ్రీకాంత్, బుచ్చయ్యపేట జడ్పిటిసి దొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో జన హాజరు

సీఎం జగన్మోహన్ రెడ్డి సభకు నియోజకవర్గ నాలుగు మండలాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కావలసి ఉన్న ముఖ్యమంత్రి గంట ఆలస్యంగా చోడవరం వచ్చారు. మండుతున్న ఎండలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రజలు విన్నారు. కొత్తూరు జంక్షన్ మెయిన్ రోడ్‌లో బస్సుపై ముఖ్యమంత్రి ప్రసంగించడంతో స్థానిక చీడికాడ రోడ్డు నుండి ట్రాఫిక్‌ను మళ్ళించారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఆదిరెడ్డి పాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు ఆధ్వర్యంలో హత్తుకొనే చేతులు కార్యక్రమంలో భాగంగా 30 మంది నిరుపేదలైన వికలాంగులకు, వితంతులకు, అనాధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. డి.జాన్ సమర్పణ రాజు వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ట్రస్టు చైర్మన్ పువ్వల విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ పీస్ ఏంజెల్, పి.సూరిబాబు, ఎస్.నాయుడు, దీవ్యతేజ, రమ్య, స్మైలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి -పరవాడ : మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఎటువంటి తీర్మానాలు చెయ్యలేదు. ఈ సమావేశంలో వ్యవసాయం , విద్య, ఆరోగ్య, నీటిపారుదల, గృహ నిర్మాణ తదితర శాఖలపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, ఎంపిడిఒకీర్తి స్పందన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-మునగపాక : పదవ తరగతి ఫలితాల్లో మండలంలో ఉన్నత మార్కులు సాధించిన గ్రామానికి చెందిన విల్లూరి యామిని, భీసెట్టి గీత, టెక్కలి జయశ్రీ, ఆళ్ల అనుషాలను స్థానిక వెంకటేశ్వర గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ శరగడం పరదేశి నాయుడు, గణేష్ మాస్టర్, మాధవి, రాంబాబు, మురళి, అర్జున్, వెంకట్, అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాంకు అకౌంట్లలో పింఛన్లు నగదు జమ

ప్రజాశక్తి- కె.కోటపాడు : వృద్ధాప్య, వికలాంగులకు పింఛన్లు లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లకు నేరుగా జమ చేయడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో కే అప్పలరాజు తెలిపారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంక్ అకౌంట్ ఉన్నవారందరికీ ఒకటో తేదీనే పింఛన్లు జమ చేయడం జరుగుతుందని, బ్యాంక్ అకౌంట్ లేనివారికి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు, వికలాంగులకు నేరుగా వారి వెళ్ళవద్దు పింఛను అందించడం జరుగుతుందని చెప్పారు. పింఛన్ దారులు ఆయా గ్రామ సచివాలయాలకు రానక్కర్లేదని, ఈ విషయం గ్రామాల్లో దండోరా ద్వారా తెలియపరచాలని కార్యదర్శులను ఆదేశించారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న

బిజెపి అభ్యర్థి సిఎం రమేష్‌పై చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారికి సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి -అనకాపల్లి

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్, వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు సోమవారం జిల్లా ఎన్నికల అధికారికి పిర్యాదు చేశారు. సిఎం.రమేష్ ఎన్నికల నిబంధనలను పూర్తిగా విస్మరించి ప్రచారం నిర్వహించడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, ఓటర్లకు తాయిలాలు పంచడం, కుల, మతాల ప్రాతిపదికన ప్రచారం, సమావేశాలు నిర్వహించడం చేస్తున్నారని తెలిపారు. ఓటర్లకు పంపిణీ చేస్తున్న కరపత్రాల్లో ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచురణకర్త పేరు, ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఎన్ని కాపీలు ముద్రించారనే వివరాలు ఉండాలని, కాని అలాగే సిఎం.రమేష్‌కు సంబంధించి కరపత్రాల్లో ఎటువంటి వివరాలను ప్రచురించకుండా లక్షలాది కరపత్రాలు అనకాపల్లి పార్లమెంట్ మొత్తం పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఓటర్లను ప్రలోభ పెడుతూ బిజెపి ఎన్నికల గుర్తు కమలం పువ్వు ఆకారంతో విసనకర్రలను, కీ-చైన్లు ఇంటింటికీ ఓటర్లకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. గ్రామాలలో కుల సంఘాలను, ఇతర మతాలను దూషించే విధంగా ప్రసంగాలు చేస్తూ ఉద్రిక్తతలకు తావునిచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వందలాది మంది స్థానికేతరులను ఎన్నికల ప్రచారం పేరుతో తీసుకు వచ్చి మద్యం, డబ్బు పంపిణీకి పాల్పడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్వీట్ బాక్సులు పంపిణీ, మహిళా కోలాట దళాలకు బిజెపి ఎన్నికల గుర్తుతో కలిగిన పసుపు కుంకాలు పేరుతో చీరలు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. సిఎం.రమేష్ ప్రచార రథాలుగా ఉన్న వాటికి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద డిజె సౌండ్ సిస్టమ్స్ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వాడుతున్నారని తెలిపారు. కొన్ని వాహనాలను సాధారణ సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి తీసుకుని డిజె సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారన్నారు. అటువంటి వాహనాలను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. ఇలా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న సిఎం. రమేష్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్లాంట్ రక్షణకు ఇండియా వేదికను గెలిపిద్దాం

ఇండియా ఫోరం, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు



ఇండియా వేదిక అభ్యర్థులతో కలిసి అభివాదం చేస్తున్న ఉక్కు కార్మిక నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం

విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఇండియా కూటమిని గెలిపించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ కోరారు. సోమవారం ఉక్కునగరం స్టీల్ సిఐటియు కార్యాలయంలో స్టీల్ వర్కర్ ప్రత్యేక సంచికను ఇండియా ఫోరం, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ రక్షణ అంశాన్ని అన్ని రాజకీయపార్టీలు తమ మేనిఫెస్టోలో స్పష్టం చేయాలని ఉద్యమిస్తున్నామన్నారు. అయితే దీనిపై ప్రధాన పార్టీల నుంచి స్పందన లేమి, ఉక్కు పరిరక్షణపై వారి చిత్తశుద్ధి, విశ్వసనీయతను స్పష్టం అయితే సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్, తదితర పార్టీలతో కూడిన ఇండియా ఫోరం తమ మేనిఫెస్టో ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని స్పష్టం చేసినందున వచ్చే ఎన్నికల్లో వేదిక అభ్యర్థులకు మద్దతు పలుకుతూ స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు ఈ పోరాటాన్ని ఉధతం చేయడం సిద్ధం కావాలని అభ్యర్థించారు.

గాజువాక సిపిఎం అభ్యర్థి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి ఆదినుంచి అండగా ఉంటున్న సిపిఎంకు ఉక్కు కార్మికుల ఓట్లు అడిగే నైతిక హక్కు ఉందన్నారు. ఉక్కు కార్మికుల గళాన్ని రాష్ట్ర అసెంబ్లీలో వినిపించడానికి సిద్ధంగా ఉన్నానని, తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. విశాఖ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పి సత్యారెడ్డి మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ప్రజలకు మరింత చేరువు చేసేందుకు 'ఉక్కు సత్యాగ్రహం' చిత్రాన్ని నిర్మించి ఈ పోరాటానికి తన వంతు సహకారాన్ని అందించానన్నారు. కేంద్రంలోని బిజెపికి వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ అంశంపై పార్లమెంట్‌లో తన వాణిని వినిపించేందుకు తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేసి పాలన సాగిస్తున్న బిజెపిని చిత్తుగా ఓడించాలని, గాజువాక ఎమ్మెల్యేగా కార్మికవర్గం నేత సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడును, విశాఖ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సత్యారావులకు మద్దతు నిలవాలని కోరారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అష్టదిగ్బంధనంలో పెట్టి, కార్పొరేట్లకు నజరానా ఇవ్వాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని, దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యుత్‌ను అమ్మేస్థాయి నుంచి నేడు కొనుక్కోవాల్సిన దుస్థితికి నెట్టిన బిజెపి, దానికి అంటకాగిన పార్టీలకు బుద్ధి చెప్పాలని, కార్మిక వర్గం ప్రజలు విజ్ఞతతో ఆలోచించి తమ ఓటు హక్కుతో ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్, పెందుర్తి కాంగ్రెస్ అభ్యర్థి భగత్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రామకష్ణ, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు వైటి దాస్, ఎన్ రామారావు, పి శ్రీనివాసరాజు, తాండ్ర కనకరాజు, రాజబాబు, వర్మ, జె ముత్యాలు, సిహెచ్ సన్యాసిరావు, కర్రి ప్రకాష్, రామ్ కుమార్, పరంధామయ్య, శ్రీనివాస్ స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు,వి ప్రసాద్, పుల్లారావు, మరిడయ్య, నీలకంఠం, గంగాధర్, నర్సింగరావు, సూర్యనారాయణ, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రచార నిర్వహిస్తున్న బిఎస్‌పి ఎంపీ అభ్యర్థి ఆవశ్య లహరి

పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ, పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి -చింతూరు

పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారాలు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ అరకు పార్లమెంటరీ అభ్యర్థి అవశ్యలహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతూరులో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను తుంగలో తొక్కాయని, బోయ వాల్మీకి ఎస్టీ జాబితాలో చేర్చి నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో రంపచోడవరం బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థి కాకూర్ కన్నం రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, సాందల మంగిరెడ్డి, ఫన్ని, సుశీల పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో బహుజన సమాజ్వాజ్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆవశ్య లహరిని ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

ఎన్నికల ప్రచారంలో డిజె సౌండ్ సిస్టమ్ నిషేధంపై హర్షం

ప్రజాశక్తి -అనకాపల్లి

ఎన్నికల ప్రచారాల్లో వివిధ రాజకీయ పార్టీలు ఉపయోగిస్తున్న డిజె సౌండ్ సిస్టంను నిషేధించడంపై ఎన్నికల అధికారి రవి పఠాన్ శెట్టికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ సోమవార ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు నేటి నుంచి ఊపిరి పీల్చుకున్నాని తెలిపారు. ఎన్నిక ప్రధాన అధికారికి విశ్రాంతి ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ రాసిన లేఖ. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం ప్రతినిధులు ఈ అంశాన్ని లేవదీసి దానిని మినిట్స్‌లో రికార్డు చేయడంతో మొత్తానికి జిల్లా అధికార యంత్రాంగం కదిలిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు పోటిపడుతున్న పార్టీలు డీజే సౌండ్ సిస్టమ్స్ వాడకాన్ని స్వచందంగా మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని అమృతపురం గ్రామంలో వెన్నెల వారి కల్లాల వద్ద తుప్పల రేవిడి సరుగుడు తోటలో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇది గమనించిన జనసేన నాయకుడు వెన్నెల నరేష్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఆటోనగర్ నుండి అగ్నిమాపక శకటంతో వచ్చి సరుగుడు తోటలో మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది సరుగుడు తోట భారీ అగ్ని ప్రమాదానికి గురికాకుండా రక్షించారు. ఈ కార్యక్రమంలో పైడం నాయుడు వెన్నల శ్రీను, తైనాన శ్రీరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని మేడిచర్ల గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారు సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 75 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 36 మందిని కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ దుర్గ భవాని, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆడినేటర్ సిహెచ్ అశ్వని కుమార్ నర్సింగ్ స్టాఫ్ దీపిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.